బీఆర్ఎస్ పటిష్టతకు కృషి చేయాలి

బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి

మండల కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న కంఠారెడ్డి తిరుపతిరెడ్డి

నిజాంపేట, ఏప్రిల్ 13: బీఆర్ఎస్ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని బీఆర్ఎస్ నాయకుడు, రామాయంపేట, నిజాంపేట మండలాల ఎన్నికల ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి అన్నారు. శనివారం మెదక్ పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో నిజాంపేటలోని బీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన మండల కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా కంఠారెడ్డి మాట్లాడుతూ ప్రజల సంక్షేమమే తన లక్ష్యంగా పని చేసిన మహోన్నతమైన వ్యక్తి కేసీఆర్ అన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన ప్రభుత్వ పథకాలను కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని, పార్టీ పటిష్టతకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. కారు గుర్తుకు ఓటేసి మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి గెలుపునకు కార్యకర్తలు కృషి చేయాలన్నారు. సమావేశంలో ఎంపీపీ సిద్ధిరాములు, పార్టీ మండల అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు నాగరాజు, కల్వకుంట పీఏసీఎస్ చైర్మన్ అందె కొండల్‌రెడ్డి, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, గ్రామాధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణకు పటిష్ట చర్యలు

అక్కన్నపేట అటవీప్రాంతంలో సాసర్ ఫీట్లలో నీళ్లు పోస్తున్న బీట్ ఆఫీసర్, వాచర్

రామాయంపేట, ఏప్రిల్ 13: వేసవి నేపథ్యంలో ట్యాంకర్లతో అడవిలో ఏర్పాటుచేసిన సాసర్ ఫీట్లలో నీరు పోసి జంతువుల దప్పికను తీర్చడానికి తీరుస్తున్నామని ఎఫ్ఆర్‌వో విద్యాసాగర్ తెలిపారు. శనివారం అటవీశాఖ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ 500 హెక్టార్లలో ఉన్న రామాయంపేట అడవి చుట్టూరా కంచె ఏర్పాటు చేశామన్నారు. జంతువులు ఊర్లలోకి రాకుండా పటిష్ట చర్యలు చేపడుతున్నామన్నారు. అటవీ ప్రాంతంలోని అన్ని బీట్లలో సాసర్ ఫీట్లు ఏర్పాటు చేశామన్నారు. జంతువులకు తాగునీటితో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. తమ సిబ్బందితో రోజూ సీసీ కెమెరాలతో ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎఫ్ఆర్‌వో వెంట డిప్యూటీ ఎఫ్ఆర్‌వో కుత్బుద్దీన్, బీట్ ఆఫీసర్ రాము తదితరులు ఉన్నారు.

ధర్మారంలో శ్రీరామనవమి వేడుకలు ప్రారంభం

హనుమాన్ దేవాలయంలో శ్రీరాముల వారి ఉత్సవ విగ్రహాలు

రామాయంపేట, ఏప్రిల్ 13: మండలంలోని డి.ధర్మారం గ్రామంలో శ్రీరామనవమి వేడుకలు ఆట్టహాసంగా ప్రారంభమయ్యాయి. శనివారం గ్రామ శివారులో నిర్మించిన రఘుపతి గుట్ట రామాలయానికి ఉత్సవ విగ్రహాలను హనుమాన్ భక్తులు, మాలధారులు ఊరేగింపుగా విగ్రహాలను తరలించారు. ఈ ఉత్సవాలు 17వ తేదీ వరకు ఉత్సవ విగ్రహాల ప్రతిష్ఠాపన, రాములోరి కల్యాణం చేయించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

మోదీ నాయకత్వాన్ని ప్రజలు కోరుకుంటున్నారు

బీజేపీ మధ్యప్రదేశ్ ఇన్‌చార్జి పొలసాని శ్రీనివాస్ యాదవ్



చేగుంట, ఏప్రిల్ 13: దేశంలో మరోసారి మోదీ నాయకత్వాని ప్రజలు కోరుకుంటాన్నరని బీజేపీ మధ్యప్రదేవ్ ఇన్‌చార్జి పొలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శనివారం నార్సింగిలో ఆయనను బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించారు. బీజేపీ జిల్లా నాయకులు సత్యపాల్‌రెడ్డి, తాళ్ల విజయ్‌కుమార్ గౌడ్, చంద్రశేఖర్, నరేశ్, లింగారెడ్డి, గురుపాదం, యాదగిరి, లక్ష్మణ్, శేఖర్‌రెడ్డి, సాయి, వేణు, ప్రశాంత్, నవీన్ ఉన్నారు.

ఎన్నికల్లో ధన ప్రవాహాన్ని అడ్డుకోవాలి

మాట్లాడుతున్న జై భారత్ ఎస్‌సీ పీవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖదిజ్జాసి గణేష్ గల్లా

మెదక్, ఏప్రిల్ 13 (నమస్తే తెలంగాణ): దేశ ఎన్నికల్లో ఎటుచూసినా ధన ప్రవాహం కనిపిస్తున్నదని జై భారత్ ఎస్‌సీపీవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జస్ట్ ఓట్ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఖదిజ్జాసి గణేశ్ గల్లా అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని స్థానిక టీఎన్జీవో భవన్‌లో ఏర్పాటు చేసిన జస్ట్ ఓట్ క్యాంపెయిన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. జైభారత్ ఎన్నికల సమయంలో ప్రజల్లోకి వెళ్లి ఓటుపై చైతన్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికీ ఎన్నో గ్రామాల్లో ధన ప్రవాహాన్ని అడ్డుకున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు రాజు, నరేందర్, సిద్ధరాములు, యేసు, సంజీవ్, మహేందర్, మల్లేశం పాల్గొన్నారు.

'జైభారత్ పార్టీ నుంచి పోటీ చేస్తా'

మాట్లాడుతున్న శోభన్‌బాబు

మెదక్, ఏప్రిల్ 13 (నమస్తే తెలంగాణ): జైభారత్ జాతీయ పార్టీ నుంచి మెదక్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తానని ఆ పార్టీ నాయకుడు శోభన్‌బాబు తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. జై భారత్ జాతీయ పార్టీకి మాజీ సీబీఐ డైరెక్టర్ జేడీ లక్ష్మీనారాయణ అధ్యక్షుడిగా ఉన్నారన్నారు. ఆయన ఆధ్వర్యంలో పార్టీని మరింత బలోపేతం చేస్తామన్నారు. ప్రతి గ్రామంలో బూత్ స్థాయి నుంచి క్యాడర్ బలంగా ఉన్నదని, గ్రామాలు, పట్టణాల్లో పార్టీని బలోపేతం చేస్తామన్నారు.

ధాన్యానికి రక్షణ కల్పించాలి

రామాయంపేట మండలంలోని కోనాపూర్‌లోని రైస్‌మిల్లర్‌తో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

నార్సింగిలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న మెదక్ అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు

- కొనుగోలు చేసిన ధాన్యాన్ని సత్వరమే రవాణా చేయాలి
- ధాన్యం తడవకుండా టార్పాలిన్లు వాడుకోవాలి
- అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు
- కొనుగోలు కేంద్రాలు, రైస్‌మిల్లుల్లో ఆకస్మిక తనిఖీ
- ధాన్యం నిల్వ ఉంచితే కఠిన చర్యలు తప్పవని మిల్లర్లకు హెచ్చరిక

రామాయంపేట, ఏప్రిల్ 13: అకాల వర్షాలతో ధాన్యం దెబ్బతినే అవకాశాలు ఉన్నాయని, ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల నుంచి తక్షణమే తరలించాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శనివారం రామాయంపేట మండలంలోని కోనాపూర్ సాయిగీత, నాగేంద్ర రైస్‌మిల్లు, నార్సింగిలోని పీఏసీఎస్, ఐకేపీ ఆధ్వర్యంలో నెలకొల్పిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా పరిశీలించారు. రైతులు, వ్యాపారులతో మాట్లాడారు. వాతావరణ పరిస్థితుల కారణంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని, ధాన్యం తూకం వేయగానే వెంటనే సంబంధిత రైస్‌మిల్‌కు తరలించాలన్నారు. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉంచకుండా ఎప్పటికప్పుడు రవాణా చేయాలన్నారు. ఒకవేళ కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉంటే ధాన్యం తడవకుండా వాటిపై టార్పాలిన్లు కప్పాలన్నారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు నిబంధనలకు లోబడి నడుచుకోవాలన్నారు. లేని పక్షంలో వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. రైస్‌మిల్లర్లు సీఎంఆర్ డెలివరీని వేగవంతం చేయాలని సూచించారు. మిల్లర్లకు ప్రభుత్వం ఇచ్చిన టార్గెట్‌కు అనుగుణంగా బియ్యం లోడ్ చేయాలన్నారు.

ధానాన్ని సత్వరమే రవాణా చేయాలి...

చేగుంట, ఏప్రిల్ 13: అకాల వర్షాలు కురుస్తున్నందున కొనుగోలు కేంద్రాల్లో ధాన్యానికి రక్షణ కల్పించి సత్వరమే సూచించిన రైస్ మిల్లర్లకు రవాణా చేయాలని, మిల్లర్లు సీఎంఆర్ డెలివరిని వేగవంతం చేయాలని మెదక్ అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు సంబంధిత అధికారులకు ఆదేశించారు. నార్సింగిలోని ఐకేపీ, పీఎస్ఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాలు, రైస్‌మిల్లులను క్షేత్రస్థాయిలో శనివారం పరిశీలించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణపై నిర్వాహకులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించడానికి తీసుకు వస్తారని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రవాణా చేయాలని సూచించారు. నిల్వ ఉన్న ధాన్యాన్ని టార్పాలిన్లతో రక్షణ కల్పించాలన్నారు. అకాల వర్షాలకు ధాన్యం తడవకూడదన్నారు. కొనుగోలు కేంద్రాల్లో నిర్వాహకులు నిబంధనలకు లోబడి నడుచుకోవాలని ఆదేశించారు. అనంతరం రైస్‌మిల్స్ ను పరిశీలించి సీఎంఆర్ డెలివరీ వేగవంతం చేయాలని, మిల్లర్లకు ఇచ్చిన టార్గెట్‌కు అనుగుణంగా బియ్యం లోడ్ చేసి రవాణా చేయాలని ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. ఆయనతో పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావు, రైస్ మిల్లర్స్, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ఉన్నారు.

పకడ్బందీగా ఎన్నికల కోడ్ అమలు

వెల్దుర్తి మండలంలోని రాయిపల్లిలో పట్టుకున్న మద్యం బాటిళ్లతో ఎస్సై నవత, సిబ్బంది

- ఇప్పటి వరకు జిల్లాలో 192 కేసులు నమోదు
- 1,05634 లీటర్ల మద్యం స్వాధీనం
- గ్రామాల్లో బెల్ట్ షాపులపై దాడులు

మెదక్, ఏప్రిల్ 13 (నమస్తే తెలంగాణ): పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఎక్సైజ్ శాఖ ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలుచేస్తున్నది. సిబ్బంది ముమ్మరంగా తనిఖీలు, గ్రామాల్లో బెల్ట్ షాపులపై దాడులు చేస్తూ మద్యాన్ని స్వాధీనం చేసుకుంటున్నారు. మెదక్ జిల్లాలో 49 మద్యం దుకాణాలు, 4 బార్లు ఉన్నాయి. ఎన్నికల కోడ్ కూసినప్పటి నుంచి ఇప్పటివరకు 192 కేసులు నమోదుచేశారు. ఒక కారు, 9 మోటార్ బైక్‌లను సీజ్ చేశారు. రూ.89,31,573 విలువ గల 1,05,634 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎవరైనా అక్రమంగా మద్యం అమ్మితే వెంటనే కేసులు నమోదు చేసి సీజ్ చేస్తున్నారు.

192 కేసులు నమోదు చేశాం..

ఎన్నికల కోడ్ నేపథ్యంలో అక్రమంగా మద్యం విక్రయిస్తే చర్యలు తప్పవు. కోడ్ ప్రారంభం నుంచి ఇప్పటివరకు 192 కేసులు నమోదు చేశాం. గ్రామాల్లో బెల్ట్‌షాపుల ఏర్పాటుకు అనుమతులు ఉండవు. ఎవరైనా అక్రమంగా మద్యం అమ్మితే కేసులు నమోదు చేస్తున్నాం. దాబాలపై కూడా ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తాం. ఎక్కడైనా మద్యం సిట్టింగ్‌లు ఏర్పాటు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. **- శ్రీనివాస్‌రెడ్డి, ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్**

బెల్ట్‌షాపులపై ఉన్న దృష్టి దాబాలపై ఏదీ?

ఎక్సైజ్ శాఖకు బెల్ట్‌షాపుల కట్టడిపై ఉన్న దృష్టి జిల్లాలోని దాబాలపై లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండా నడుస్తున్న దాబాలపై ఎక్సైజ్ శాఖ కన్నెత్తి చూడడంలేదనే విమర్శిస్తున్నారు. అర్ధరాత్రి తర్వాత కూడా దాబాల్లో మద్యం సిట్టింగ్‌లు ఏర్పాటుచేస్తున్నారు. పల్లెల్లో కిరాణా దుకాణాలు, టీ స్టాళ్లు, హోటళ్లు వంటి వాటిల్లో బెల్ట్ షాపులు నిర్వహిస్తే వెంటనే దాడులు చేసి కేసులు నమోదు చేస్తున్నారు. కానీ దాబాలను పట్టించుకోవడం లేదు.

అక్రమంగా నిల్వచేసిన మద్యం పట్టివేత

వెల్దుర్తి, ఏప్రిల్ 13: అక్రమంగా నిల్వ చేసిన మద్యాన్ని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు వెల్దుర్తి పోలీసులు తెలిపారు. శనివారం ఎస్సై నవత మాట్లాడుతూ మండలంలోని రామాయిపల్లి గ్రామంలో మద్యం అక్రమంగా నిల్వ చేసిన సమాచారంతో దాడులు చేసినట్లు తెలిపారు. అక్రమంగా నిల్వ చేసిన 24.4 లీటర్ల మద్యం వాటి విలువ రూ.14,780 ఉంటుందన్నారు. మద్యం నిల్వ చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పెద్దశంకరంపేటలో రూ.4.50 లక్షలు స్వాధీనం

పెద్దశంకరంపేట కోలపల్లి చెక్‌పోస్ట్ వద్ద తనిఖీ చేస్తున్న సీఐ, ఎస్సైలు

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 13: మండలంలోని కోలపల్లి టోల్‌ప్లాజా చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు శనివారం సాయంత్రం తనిఖీ చేసి, రూ.4.50 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. మహారాష్ట్రలోని నాందేడ్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ఇన్నోవా కారును తనిఖీ చేయగా, ఎలాంటి ఆధారాలు లేకుండా ఈ నగదును తీసుకెళ్తున్నట్టు గుర్తించారు. వాటిని జప్తు చేసి సంగారెడ్డి గ్రీవెన్స్‌కు తరలించినట్లు అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి, పేట ఎస్సై శంకర్ తెలిపారు.

మనోహరాబాద్‌లో రూ. 2.65 లక్షలు

మనోహరాబాద్, ఏప్రిల్ 13: మండలంలోని కాళ్లకల్ చెక్‌పోస్టు వద్ద పోలీసుల తనిఖీలో వేర్వేరు ఘటనల్లో ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.2.65 లక్షల నగదును స్వాధీనం చేసున్నారు. ఎస్సై కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా మల్లాపూర్‌కు చెందిన సాగర్ సూర్యవంశీ స్కార్పియోలో తరలిస్తున్న రూ.లక్ష, రంగారెడ్డి జిల్లా హైదర్‌షా కోటేకు చెందిన కె.హరినాథ్‌చారి ఎర్టిగా వాహనంలో తరలిస్తున్న రూ.లక్ష, అదే జిల్లా ఉప్పల్‌కు చెందిన బాష్‌నబ్‌జన నుంచి ఎర్టిగా వాహనంలో తరలిస్తున్న రూ.65 వేలు మొత్తం కలిపి రూ.2.65 లక్షల నగదును సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. సంబంధిత వ్యక్తుల నగదుకు రసీదులు అందజేసినట్లు మనోహరాబాద్ ఎస్సై కరుణాకర్‌రెడ్డి తెలిపారు.

మనోహరాబాద్‌లో నగదుకు రసీదును అందజేస్తున్న ఎస్సై కరుణాకర్‌రెడ్డి

కేసీఆర్ సభను విజయవంతం చేయాలి

మాట్లాడుతున్న ఎంపీపీ, జడ్పీటీసీ

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 13: ఈనెల 16న నిర్వహించే కేసీఆర్ సభను విజయవంతం చేయాలని ఎంపీపీ జంగం శ్రీనివాస్, జడ్పీటీసీ విజయరామరాజు అన్నారు. శనివారం మండలంలోని ఉత్తులూర్ గ్రామంలో బీఆర్ఎస్ కార్యకర్తలతో మాట్లాడారు. ఈనెల 16న సుల్తాన్‌పూర్ టోల్‌గేట్ వద్ద నిర్వహించనున్న బహిరంగ సభను బీఆర్ఎస్ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఆయనతో మాజీ సర్పంచ్ శంకర్ గౌడ్, మండల రైతుబంధు అధ్యక్షుడు సురేశ్ గౌడ్ ఉన్నారు.

బీఆర్ఎస్ సమావేశానికి తరలిన నాయకులు

నార్సింగి మండలంను నుంచి బీఆర్ఎస్ సమావేశానికి వెళ్తున్న జడ్పీటీసీ తదితరులు

చేగుంట, ఏప్రిల్ 13: దౌల్తాబాద్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ మెదక్ పార్లమెంట్ సన్నాహక సమావేశానికి చేగుంట, నార్సింగి మండలాల నుంచి బీఆర్ఎస్ నాయకులు శనివారం భారీగా తరలివెళ్లారు. చేగుంటలో పార్టీ జిల్లా నాయకుడు రంగయ్యగారి రాజిరెడ్డి, మండల అధ్యక్షుడు కోమండ్ల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో, నార్సింగి మండలంలో జడ్పీటీసీ బాణపురం కృష్ణారెడ్డి, ఎంపీపీ చిందం సబీతారవీందర్, పార్టీ మండల అధ్యక్షుడు మైలరాం బాబు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు.

వల్లభాపూర్ పాఠశాలకు డెస్కులు అందజేత

చేగుంట, ఏప్రిల్ 13: మండలంలోని వల్లభాపూర్ ప్రాథమిక పాఠశాలకు సుప్రసన్నా సోలార్ ఎనర్జీ ప్రైవేటు లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో 14 డ్యూయల్ డిస్కులు, హ్యాండ్ వాష్ యూనిట్లు అందజేసినట్లు హెచ్ఎం పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. వారితో సుప్రసన్నా సోలార్ ఎనర్జీ ప్రైవేటు లిమిటెడ్ డిప్యూటీ మేనేజర్ సత్యశీలన్, ఉపాధ్యాయులు సమత, అంగన్‌వాడీ టీచర్ శోభారాణి ఉన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

వెల్దుర్తి బస్టాండ్ చౌరస్తాలో ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న కళాకారులు

వెల్దుర్తి, ఏప్రిల్ 13: ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సాంస్కృతిక సారథి కళాకారుల జిల్లా టీమ్ లీడర్ సిద్దు అన్నారు. శనివారం కలెక్టర్ ఆదేశాల మేరకు వెల్దుర్తి బస్టాండ్ చౌరస్తా వద్ద ఓటు హక్కుపై ఆటాపాటలతో అవగాహన కల్పించారు. 18 ఏండ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండాలని తెలిపారు. కళాకారులు రామారావు, ఎల్లం, దాస్, లక్ష్మి, మాధవి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పెద్దశంకరంపేట మండలంలో 38.6 ఎంఎం వర్షం

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 13: పెద్దశంకరంపేట మండలంలో శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు 38.6 ఎంఎం వర్షం కురిసినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. ఈ వర్షంతో కోతకొచ్చిన వరి పంట దెబ్బ తింటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వేసవి తాపం నుంచి ప్రజలకు కొంత ఉపశమనం కలిగించింది.

మెదక్‌లో ఎగిరేది గులాబీ జెండానే : బీఆర్ఎస్ యూత్

చిలిపిచెడ్, ఏప్రిల్ 13: మెదక్ పార్లమెంట్ ఎన్నికల్లో ఎగిరేది గులాబీ జెండానే అని బీఆర్ఎస్ చిలిపిచెడ్ మండల యూత్ మాజీ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ మెదక్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో బీఆర్ఎస్ బలంగా ఉందన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలుస్తారన్నారు. కాంగ్రెస్, బీజేపీలు చేసే తప్పుడు ప్రచారాన్ని ప్రజలే తిప్పికొట్టాలన్నారు. నియోజకవర్గంలో బీఆర్ఎస్‌లో ఉండే ప్రతి కార్యకర్త, నాయకులు పార్టీలోనే ఉంటారన్నారు.

కోదండ రాముడి కల్యాణానికి రండి

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 13: జిల్లా కేంద్రంలోని కోదండ రామాలయంలో నిర్వహించే సీతారాముల కల్యాణానికి హాజరు కావాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు నరేందర్ శనివారం పలువురిని ఆహ్వానించారు. మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బట్టి జగపతి, తదితర ప్రజాప్రతినిధులకు ఆహ్వాన పత్రికలు అందజేశారు.

చండికామాత ఆలయంలో చోరీ

శివ్వంపేట, ఏప్రిల్ 13: శివ్వంపేట మండలంలోని చండి గ్రామంలో ఉన్న చండికామాత ఆలయంలో శుక్రవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఆలయంలోకి ప్రవేశించి అమ్మవారికి సంబంధించిన వెండి కిరీటంతోపాటు సామగ్రిని దొంగలించినట్లు పోలీసులు తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు అంజిరెడ్డి, నర్సారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సేవాభావం అలవర్చుకోవాలి

వెల్దుర్తి, ఏప్రిల్ 13: ప్రతిఒక్కరూ భక్తి, సేవాభావం అలవర్చుకోవాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి అన్నారు. శనివారం వెల్దుర్తిలోని శ్రీదేవి భూదేవీ మేంకటేశ్వరస్వామి, శివపార్వతుల కల్యాణం వైభవంగా జరిపించారు. మన్నెవారి జలాల్‌పూర్ గ్రామ శివారులో 24 నుంచి 26 వరకు నిర్వహించే మహంకాళి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనకు హాజరుకావాలని ఆలయ కమిటీ చైర్మన్ సత్యనారాయణ, రాజిరెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఆయనతో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహేశ్‌రెడ్డి, నాయకులు నరేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి ఉన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

PLOT FOR SALE

★గజ్వేల్ టౌన్ మెయిన్ రోడ్డు, SBI దగ్గర, 161 చ.గ. ఇంటి స్థలం అమ్మబడును. సంప్ర: 8143366630, 9989554915
NT-115

WANTED

★KFC Hiring P/F Time Jobs in Hyd. SSC Pass, 18 yrs Abv. M&F. 13k with Food & Accom. PF/ Medical/ Bonus/ Incentive. Ph: 9392526486, 9704449461, 8688442326.
NT-136-All

★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899.
NT-311823-All

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు, వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు మరియు ఇతర ప్రకటనల కొరకు ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
సిద్దిపేట/గజ్వేల్/తూప్రాన్/మెదక్ : 80966 77663
సంగారెడ్డి/జహీరాబాద్/నారాయణఖేడ్ : 9182777658
పటాన్‌చెరు : 80966 77657